
సాక్షి
విశాఖపట్నం
మంగళవారం । 26 । డిసెంబర్ । 2023



పుస్తకాలే ప్రపంచం
వారు అక్షర నేస్తాలు...పుస్తక ప్రియులు..ప్రభుత్వ కొలువుకోసం **అహర్నిశలు శ్రమిస్తున్నారు.**
8లో



సందడిగా పర్యాటక కేంద్రాలు
అల్లూరి జిల్లాలో పర్యాటక కేంద్రాలకు సోమవారం సందర్శకులు పోటెత్తారు. ఉత్సాహంగా.. ఉల్లాసంగా గడిపారు.
8లో

కనకమహాలక్ష్మి అమ్మవారికి పూజలు



మార్గశిర మాసోత్స వాల సందర్భంగా కనకమహాలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.
8లో

న్యూస్‌రీల్

నేడు గవర్నర్ రాక



మహారాణిపేట: ఆంధ్ర ప్రదేశ్ గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ మంగళవారం విశాఖ రానున్నారు. వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌లో రాత్రి 11.35 గంటలకు విశాఖ రైల్వే స్టేషన్‌కు చేరుకుంటారు. రైల్వే స్టేషన్ నుంచి గవర్నర్ నేరుగా నోవొటెల్ హోటల్‌కు వెళతారు. బుధవారం కూడా అదే హోటల్‌లో బస చేస్తారు. గురువారం ఉదయం 11 గంటల నుంచి 12.30 గంటల వరకు ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమంలో పాల్గొంటారు. అక్కడ నుంచి నేరుగా నోవొటెల్ హోటల్‌కు చేరుకొని అక్కడ బస చేస్తారు. శుక్రవారం మధ్యాహ్నం 1.10 గంటలకు అమరావతి ఎక్స్‌ప్రెస్‌లో విజయవాడ వెళతారు.

ఐఎన్ఎస్ ఘూరియల్‌లో ఎన్‌సీసీ క్యాడెట్లు



ఎన్‌సీసీ క్యాడెట్లకు నౌకలో ఫైర్ ఫైటింగ్‌పై శిక్షణ ఇస్తున్న నేవీ సిబ్బంది

విశాఖ సిటీ: రెండు వారాల సముద్ర శిక్షణలో భాగంగా దేశంలో ఉన్న 59 మంది ఎన్‌సీసీ క్యాడెట్లకు ఐఎన్ఎస్ ఘూరియల్ నౌకలో నేవీ అధికారులు శిక్షణ ఇచ్చారు. ఇందులో సెయిలింగ్, ఫైర్ ఫైటింగ్, డ్యామేజ్ కంట్రోల్, చిన్న ఆయుధాలపై శిక్షణ అందించారు. అలాగే నేవల్ డాక్‌యార్డ్‌ను, అందులో పలు నౌకలను సందర్శించారు. నావికాదళ కార్యకలాపాలను తెలుసుకున్నారు.

కరోనా రోగులకు చికిత్స



ఐసోలేషన్ వార్డు

మహారాణిపేట: కరోనా సోకిన ఇద్దరు రోగులు కేజీహెచ్ ఐసోలేషన్ వార్డులో చికిత్స పొందుతున్నారు. వారి ఆరోగ్యం నిలకడగా ఉందని కేజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ రాధాకృష్ణ తెలిపారు. కైలాసపురానికి చెందిన 51 ఏళ్ల మహిళ దీర్ఘకాలిక వ్యాధులతో ప్రభుత్వ ఛాతి ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఈమెకు కరోనా పాజిటివ్ రావడంతో కేజీహెచ్‌కు తరలించారు. ప్రస్తుతం వెంటిలేటర్‌పై చికిత్స అందిస్తున్నారు. ఇంతవరకు కరోనా సోకిన వారి సంఖ్య 18కి చేరిందని ఆంధ్రా మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు తెలిపారు. ఆదివారం తీసిన శాంపిల్స్ ఇంకా పరీక్షించలేదన్నారు.

కేజీహెచ్‌లో 11 వాటర్ కూలర్ల ఏర్పాటు



రోగుల కోసం ఏర్పాటు చేసిన వాటర్ కూలర్లు

మహారాణిపేట: కేజీహెచ్‌లో 11 వాటర్ కూలర్లను ఏర్పాటు చేశారు. కలెక్టర్ మల్లికార్జున ఆదేశాల మేరకు దివ్యాంగులు, విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ నిధులు రూ.30లక్షలతో వీటిని ఏర్పాటు చేశారు. సోమవారం కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్ కుమార్, ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్య మౌలిక సదుపాయాల సంస్థ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ డీఏ నాయుడు, డీఈఈ మన్మథరావు తదితరులు వీటిని పరిశీలించారు.

అండర్ పాస్‌వే పనుల పూర్తి



చంద్రనగర్ వద్ద పూర్తయిన పనులు

గోపాలపట్నం: బాజీ జంక్షన్ నుంచి చంద్రనగర్‌కు వెళ్లే అండర్‌పాస్‌వే పనులు సోమవారం రైల్వే అధికారులు పూర్తి చేశారు. ఇక్కడి రెండు లెవల్ క్రాసింగ్‌ల వద్ద ఈ అండర్ పాస్‌వే పనులు రూ.9 కోట్లతో చేపట్టారు. శనివారం 4 ట్రాక్‌ల దిగువన పుష్ బాక్స్‌లు వేయగా, సోమవారం ఉదయం మరో రెండు ట్రాక్‌లు దిగువన పుష్ బాక్స్‌లు ఏర్పాటు చేశారు. మొత్తంగా 64 మీటర్లు మేర 32 పుష్ బాక్స్‌లు వేశారు. ఇక రక్షణ గోడ రోడ్డు వేయాల్సి ఉంది. వెంటనే ట్రాక్ పునరుద్ధరణ పనులు కూడా పూర్తి చేశారు.

అదరగొట్టేద్దాం

- నేటి నుంచి ఆడుదాం ఆంధ్రా పోటీలు
- ఏర్పాటు పూర్తి చేసిన యంత్రాంగం
- చంద్రంపాలెం పాఠశాలలో పోటీలు ప్రారంభం





పినగాడిలోని విస్తం కళాశాలలో జరిగిన మ్యాచ్‌లో బ్యాటింగ్ చేస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్



విశాఖ స్పోర్ట్స్: క్రీడా ప్రతిభను గుర్తించడంతోపాటు మట్టిలో మాణిక్యాలను వెలుగులోకి తీసుకురావడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం 'ఆడుదాం ఆంధ్ర' అనే భారీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. గ్రామ నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఐదు క్రీడాంశాల్లో ఈ పోటీలు జరగనున్నాయి. విశాఖ జిల్లాకు సంబంధించి చంద్రంపాలెం ఉన్నత పాఠశాలలో మంగళవారం ఉదయం 10 గంటలకు పోటీలను ప్రారంభించనున్నారు. 15 ఏళ్లు నిండి.. రిజిస్ట్రేషన్ చేసుకున్న ప్రతి ఒక్కరూ తలపడే ఈ టోర్నీలో తొలి రెండు స్థాయిల్లో గ్రామ పంచాయతీ/వార్డు మొదలుకుని మండల స్థాయి వరకు క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్‌లతో పాటు గ్రామీణ క్రీడలైన ఖోఖో, కబడ్డీ పోటీలు జరగనున్నాయి. ఈ స్థాయిలో ఆడేందుకు పూర్తి స్థాయిలో నియమ నిబంధనలు తెలియకపోయినా.. ఆట స్వరూపం తెలిసి ఉంటే చాలు. ఇక పూర్తి నియమ నిబంధనలతో నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిలో పోటీలు నిర్వహించి.. ఈ మూడు స్థాయిల్లో సత్తా చాటిన వారికి భారీగా నగదు ప్రోత్సాహకాలను అందించనున్నారు. ఇక్కడ సత్తా చాటే క్రీడాకారులను ఉన్నత స్థాయి శిక్షణకు ఎంపిక చేయనున్నారు. గ్రామ స్థాయి నుంచి ఆడుతూ ముందుకు సాగే ఈ టోర్నీ ఈనెల 26న ప్రారంభమై ఫిబ్రవరి 10వ తేదీతో ముగియనుంది.

పోటీలు ఈ నెల 26 నుంచి ఫిబ్రవరి 10 వరకు జరుగుతాయి
వార్డు/గ్రామ సచివాలయ పరిధిలో..
ఈనెల 26 నుంచి జనవరి 9 వరకు
మండల స్థాయిలో..
జనవరి 10 నుంచి 23 వరకు
నియోజకవర్గ స్థాయిలో
జనవరి 24 నుంచి 30 వరకు
జిల్లా స్థాయిలో..
జనవరి 31 ఫిబ్రవరి 5 వరకు
రాష్ట్ర స్థాయిలో..
ఫిబ్రవరి 6 నుంచి 10వ తేదీ వరకు

రిజిస్ట్రేషన్లు చేసుకున్నవారు 1,34,399 మంది
కాంపిటేటివ్ క్రీడలకు 1,10,101 మంది
పురుషులు 68,573 మంది
మహిళలు 41,528 మంది
నాన్ కాంపిటేటివ్ క్రీడలకు 24,298 మంది
మొత్తం టీమ్‌లు (5 ఆటలు కలిపి)- 6,971
గుర్తించిన మైదానాలు- 159

ఎంతమంది అంటే..
జిల్లాలోని 607 సచివాలయాల పరిధిలోని 12,408 క్లస్టర్ల నుంచి ఆటగాళ్లు వాలీబాల్, బ్యాడ్మింటన్, కబడ్డీ, ఖోఖోతో పాటు క్రికెట్ ఆడేందుకు సిద్ధమయ్యారు. విశాఖ జిల్లా పరిధిలోని ఏడు జోన్లతో పాటు ఆనందపురం, భీమిలి, పద్మనాభంతో పాటు పెందుర్తిలోని సచివాలయాల నుంచి ఆటకు సిద్ధమయ్యారు. మొత్తం 1,34,399 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. వీరిలో కాంపిటేటివ్ క్రీడలకు 1,10,101 మంది రిజిస్టర్ చేసుకున్నారు. ఇందులో 68,573 మంది పురుషులుండగా 41,528 మంది మహిళలున్నారు. అదేవిధంగా నాన్ కాంపిటేటివ్ క్రీడలకు 24,298 మంది రిజిస్టర్ చేసుకున్నారు.



పోటీల ప్రారంభోత్సవానికి సిద్ధం చేసిన చంద్రంపాలెం పాఠశాల మైదానం

క్రికెట్
మెన్ టీమ్‌లు 2,683
మ్యాచ్‌లు -1,464
వుమెన్ టీమ్‌లు- 343
మ్యాచ్‌లు -66



బ్యాడ్మింటన్
మెన్ టీమ్‌లు - 3,159
మ్యాచ్‌లు -1,681
వుమెన్ టీమ్‌లు- 3,508
మ్యాచ్‌లు - 1820



కబడ్డీ
మెన్ టీమ్‌లు - 925
మ్యాచ్‌లు - 369
వుమెన్ టీమ్‌లు- 916
మ్యాచ్‌లు - 360



క్రీడాంశాలు
క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో

వాలీబాల్
మెన్ టీమ్‌లు - 1,039
మ్యాచ్‌లు - 436
వుమెన్ టీమ్‌లు- 462
మ్యాచ్‌లు - 123



ఖోఖో
మెన్ టీమ్‌లు - 404
మ్యాచ్‌లు - 78
వుమెన్ టీమ్‌లు- 1,333
మ్యాచ్‌లు - 639



భారీగానే నగదు ప్రోత్సాహకాలు
జిల్లాలోని 19 మండలాల్లోని పాఠశాలల మైదానాల్లో గ్రామ స్థాయి పోటీలు నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. రాష్ట్ర స్థాయిలో వాలీబాల్, క్రికెట్, కబడ్డీ, ఖోఖో విజేతలకు ఐదు లక్షలు, రన్నరప్‌కు మూడు, సెకండ్ రన్నరప్‌కు రెండు లక్షల రూపాయిలు ప్రోత్సాహకంగా రాష్ట్ర ప్రభుత్వం అందించనుంది. జిల్లా స్థాయి విజేతలకు అరవై వేలు, నియోజకవర్గ స్థాయి విజేతలకు రూ.35 వేలు నగదు ప్రోత్సాహకాన్ని అందించనున్నారు. ఇక బ్యాడ్మింటన్‌లో విజేతలు రాష్ట్ర స్థాయిలో విజేతలు రెండు లక్షలు అందుకోనుండగా నియోజకవర్గ స్థాయిలో ఇరవై వేలు, జిల్లా స్థాయిలో రూ.35 వేలు అందుకోనున్నారు. రన్నరప్, సెకండ్ రన్నరప్స్ నగదు ప్రోత్సాహకాలు అందుకోనున్నారు.

క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో విజేతలకు బహుమతులు ఇలా..

స్థానం	నియోజకవర్గం	జిల్లాస్థాయి	రాష్ట్రస్థాయి
ప్రథమ	రూ.35 వేలు	రూ.60 వేలు	రూ.5 లక్షలు
ద్వితీయ	రూ..15 వేలు	రూ.30 వేలు	రూ.3 లక్షలు
తృతీయ	రూ.5 వేలు	రూ. 10 వేలు	రూ.2 లక్షలు


బ్యాడ్మింటన్ విజేతలకు బహుమతులు ఇలా..

స్థానం	నియోజకవర్గం	జిల్లాస్థాయి	రాష్ట్రస్థాయి
ప్రథమ	రూ.20 వేలు	రూ.35 వేలు	రూ.2 లక్షలు
ద్వితీయ	రూ.10 వేలు	రూ.20 వేలు	రూ. లక్ష
తృతీయ	రూ.5వేలు	రూ. 10 వేల	రూ.50 వేలు

ఇలపై కరుణ కిరణం



సీతమ్మధార బాలయేసు చర్చిలో క్రిస్మస్ వేడుకలు



సెయింట్ ఆంతోనీ చర్చిలో ఫాదర్ సందేశం



లోక రక్షకుడా..



దైవ సన్నిధిలో భక్తితో..

- జిల్లా వ్యాప్తంగా ఘనంగా క్రిస్మస్ వేడుకలు
- కిటకిటలాడిన చర్చిలు
- ప్రార్థనల్లో తరించిన విశ్వాసులు

డాబాగార్డెన్స్ : కరుణామయుడైన ఏసుక్రీస్తు బాలయేసుగా భూమిపై అవతరించిన వేళ.. విశ్వాసుల హృదయాల భక్తిభావంతో నిండిపోయాయి. స్టార్లు కాంతులీనాయి. క్రిస్మస్ సంబరాలు అంబరాన్నంటాయి. క్రైస్తవులందరూ సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారు. విద్యుత్ దీపాల అలంకరణతో చర్చిలన్నీ శోభిల్లాయి. క్రిస్మస్ సందర్భంగా భక్తులందరూ సోమవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు చర్చిలకే పరిమితమయ్యారు. నూతన దుస్తులు ధరించి హ్యాపీ క్రిస్మస్.. మేర్రీ క్రిస్మస్ అంటూ పరస్పర శుభాకాంక్షలు తెలుపుకున్నారు. చర్చిలన్నీ విశ్వాసులతో కిటకిటలాడాయి. బిషప్‌లు, పాస్టర్లు, దైవ సందేశం వినిపించారు. ఏసు మార్గంలో నడవాలని సూచించారు. చాలా చర్చిల్లో పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. నగరంలోని సెయింట్ ఆంతోనీ చర్చి, ట్రినిటీ లూథరన్ చర్చి, బాప్టిస్ట్ చర్చిల్లో నిర్వహించిన క్రిస్మస్ సంబరాలకు తెల్లవారుజాము నుంచే వేలాది మంది భక్తులు తరలివచ్చారు. దీంతో కిక్కిరిసిన క్రైస్తవ భక్తులతో ఆయా చర్చిల్లో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. క్రీస్తు స్తుతి గీతాలు భక్తుల హృదయాలను పరవశింపజేశాయి. నగరంలోని జగదాంబ జంక్షన్‌తో పాటు కురుపాం మార్కెట్, రీడింగ్ రూమ్, సీతమ్మధార, ఎంవీపీ కాలనీ, ద్వారకానగర్, కంచరపాలెం తదితర ప్రాంతాల్లో ఉన్న చర్చిల్లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి.



సెయింట్ ఆంథోనీ చర్చిలో..



క్రీస్తు గీతాలు ఆలపిస్తూ...



సెయింట్ అంతోనీ చర్చిలో ప్రార్థనలు

జర్నలిస్టుల ఇళ్ల స్థలాల దరఖాస్తుకు

విశేష స్పందన

ఇప్పటి వరకు 546 దరఖాస్తులు
కలెక్టర్ మల్లికార్జున వెల్లడి

మహారాణిపేట: రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టులకు కేటాయించే ఇళ్ల స్థలాల కోసం గత నెల 23న ప్రారంభమైన ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా విశాఖ జిల్లాకు సంబంధించి ఇప్పటి వరకు 546 దరఖాస్తులు అందాయని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున తెలిపారు. 2024 జనవరి 6వ తేదీతో గడువు ముగుస్తున్నందున, అర్హులైన జర్నలిస్టులందరూ ఆన్‌లైన్ ద్వారా ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తులు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలం కేటాయించడానికి రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని ఆయన పేర్కొన్నారు. జర్నలిస్టుల వివరాలు, వారి వృత్తి అనుభవాన్ని సమాచార పౌర సంబంధాల శాఖ అధికారులు పరిశీలించిన అనంతరం ప్రాథమికంగా ధ్రువీకరించి జాబితాను తదుపరి వెరిఫికేషన్ కోసం జిల్లా స్థాయి కమిటీకి సమర్పిస్తారన్నారు. దీనికి సంబంధించి జిల్లా స్థాయి కమిటీ ఏర్పాటైందన్నారు. కమిటీలో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి చైర్‌పర్సన్‌గా, కలెక్టర్, జిల్లా రెవెన్యూ అధికారి, రెవెన్యూ డివిజనల్ అధికారులు, డీఐపీఆర్వో, ముగ్గురు జర్నలిస్టులు కేజీ రాఘవేంద్రారెడ్డి (బ్యూరో చీఫ్,సాక్షి), వి.కమలాకరరావు,(స్పెషల్ కరస్పాండెంట్, ది హిందూ), ఎన్.రవిచంద్ర (బ్యూరో చీఫ్, ఎన్‌టీవీ) సభ్యులుగా ఉంటారన్నారు. జిల్లాలో జర్నలిస్టుల ఇళ్ల స్థలాలు గుర్తించే ప్రక్రియ ఇప్పటికే కమిటీ ప్రారంభించిందని తెలిపారు. కమిటీ వెరిఫికేషన్ చేసిన అనంతరం పూర్తిస్థాయిలో ఇళ్ల స్థలాలకు అర్హులైన జర్నలిస్టుల తుది జాబితా రూపొందిస్తామన్నారు. అక్రిడేటెడ్ జర్నలిస్టులకు కేటాయించే ఇళ్ల స్థలాల విషయంలో ప్రభుత్వం 60 శాతం, 40 శాతం జర్నలిస్టులు చెల్లించాల్సి ఉంటుందని కలెక్టర్ స్పష్టం చేశారు.

అన్ని రంగాల్లో విశాఖ అభివృద్ధి

- ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్
- ముగిసిన క్రెడాయ్ ఎక్స్‌పో



క్రెడాయ్ ముగింపు సభలో మాట్లాడుతున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్

ఆరిలోవ: విశాఖ నగరంలో అన్ని రంగాల అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని పరిశ్రమలు, ఐటీ శాఖామంత్రి గుడివాడ అమర్‌నాథ్ తెలిపారు. ఎంవీపీ కాలనీలో గాదిరాజు ప్యాలస్‌లో మూడు రోజులపాటు నిర్వహించిన క్రెడాయ్ ఎక్స్‌పో షో సోమవారం ముగిసింది. రియల్ ఎస్టేట్, బ్యాంకులు, ఇంటీరియల్ మెటీరియల్ తదితర వాటికి సంబంధించిన 96 స్టాళ్లు ఏర్పాటు చేశారు.

ముగింపు కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మంత్రి అమర్‌నాథ్ మాట్లాడుతూ సమాజంలో అన్ని వర్గాల ప్రజలకు ఇళ్లను అందించడంలో క్రెడాయ్ విశాఖపట్నం చాప్టర్ కృషి చేస్తోందన్నారు. వారు చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. ఏయూలో ఆర్కిటెక్చర్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు సలాది సౌమ్య, సోవిత్ ఖడ్కా, జగదీష్ రెడ్డిలకు బీఆర్ రాజు స్మారక అవార్డులను మంత్రి అమర్‌నాథ్ అందజేశారు. దీంతో పాటు వినియోగదారులకు లక్కీ డిప్ నిర్వహించారు. విజేతలకు 5 గ్రాములు బంగారు నాణేలను అందజేశారు. కార్యక్రమంలో క్రెడాయ్ ప్రతినిధులు ధర్మేందర్, కేఎస్ఆర్‌కే రాజు, వి.శ్రీను పాల్గొన్నారు.

స్మార్ట్‌గా ఆరోగ్య శ్రీ

- 4.5 లక్షల ఆరోగ్య శ్రీ కార్డులు సిద్ధం
- పేదల ఆరోగ్యానికి భరోసా



మహారాణిపేట : పేదల పాలిట వరంగా మారిన డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య శ్రీలో సరికొత్త ఫీచర్లు అందుబాటులోకి వచ్చాయి. పేదలకు సంపూర్ణ ఆరోగ్యాన్ని ఇచ్చే ఆరోగ్యశ్రీ పరిధిని ప్రభుత్వం విస్తరించింది. కుటుంబానికి రూ.25 లక్షల విలువగల ఆరోగ్య సేవలు అందించడానికి ప్రణాళిక రూపొందించింది. ఆరోగ్య శ్రీలో వ్యాధుల సంఖ్య పెంచడంతోపాటు క్యాన్సర్ వంటి వ్యాధులను కూడా చేర్చిన విషయం తెలిసిందే. పేద ప్రజలకు 3,257 రోగాలకు కార్పొరేట్ ఆస్పత్రిలో వైద్యం అందుతోంది. ఆరోగ్యశ్రీ కార్డుండే రూ.25 లక్షల వైద్యం మనచేతిలో ఉన్నట్టే. ఇప్పటికే కొత్త ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీకి కూడా శ్రీకారం చుట్టింది. స్వర్గీయ వైఎస్ రాజశేఖరరెడ్డి వైఎస్సార్ ఆరోగ్య శ్రీని ప్రవేశ పెట్టారు. 1,059 వ్యాధులతో శ్రీకారం చుట్టారు. ఈ తర్వాత దశల వారీగా వ్యాధుల సంఖ్యను చేర్చారు. ఆ తర్వాత అధికారం చేపట్టిన చంద్రబాబు ఆరోగ్యశ్రీని నిర్వీర్యం చేశారు. ఆ తర్వాత అఖండ మెజార్టీతో అధికారం చేపట్టిన వైఎస్ తనయుడు వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి తిరిగి ఆరోగ్యశ్రీకి ప్రాణం పోశారు. ఆరోగ్య శ్రీ పథకంలో అనేక దీర్ఘకాలిక రోగాలతోపాటు మొత్తం 3,257 వ్యాధులను చేర్చారు. ప్రస్తుతం సరికొత్త ఫీచర్లతో వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కొత్తకార్డులు పంపిణీకి శ్రీకారం చుట్టారు. మొత్తం జిల్లాలో 4.50 లక్షల కార్డులు ఉన్నాయి. వీటిని దశల వారీగా పంపిణీ చేస్తున్నారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో వలంటీర్ల ద్వారా పంపిణీ కార్యక్రమం జరుగుతోంది. పదేళ్లయినా భద్రంగా ఉండేలా కార్డును రూపొందించారు. అలాగే కార్డుకు క్యూ ఆర్ కోడ్ ఉంటుంది. మొబైల్ యాప్ ద్వారా కార్డుదారుడి పూర్తి హెల్త్ రికార్డ్, ఆరోగ్య శ్రీ ద్వారా పొందిన సేవలు, రిపోర్టులు, ఎప్పుడైనా, ఎక్కడి నుంచైనా చూసుకునే విధంగా కార్డు రూపొందించారు. ఆరోగ్యశ్రీ నెట్ వర్కు ఆస్పత్రుల వివరాలు, ఆరోగ్యశ్రీ పరిధిలో ఉండే వ్యాధుల వివరాలు కూడా యాప్‌లో పొందుపరిచారు.

కార్డుల పంపిణీ



వైఎస్సార్ ఆరోగ్య శ్రీ కార్డులను పంపిణీ చేస్తున్నాం. మొత్తం 4.50 లక్షల కార్డులు ఉన్నాయి. సచివాలయం పరిధిలో వలంటీర్లు ద్వారా ఈ కార్డులు పంపిణీ జరుగుతోంది. పేదల ప్రజల కోసం ఉద్దేశించిన ఈ ఆరోగ్య శ్రీ పరిధిలోకి తెలుపు కార్డుదారులందరూ వస్తారు.

– డాక్టర్ కొటకల రాజేష్ కుమార్,
ఆరోగ్యశ్రీ సమన్వయకర్త, విశాఖజిల్లా

విమానాశ్రయంలో క్రిస్మస్ సొబగులు



టెర్మినల్ లోపల ప్రత్యేకంగా అలంకరించిన దృశ్యం



ఆకట్టుకున్న డెకరేషన్

గోపాలపట్నం: క్రిస్మస్ సందర్భంగా విశాఖ విమానాశ్రయాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. విమానాశ్రయం టెర్మినల్ లోపల పూలతో అలంకరించారు. అక్కడ ఏర్పాటుచేసిన క్రిస్మస్ ట్రీ ప్రత్యేక ఆకర్షణగా ఉంది. విద్యుత్ దీపకాంతులతో విమానాశ్రయ ధగధగ మెరిసిపోయింది. ప్రయాణికులు ఒకరికొకరు క్రిస్మస్ శుభాకాంక్షలు చెప్పుకున్నారు.

విద్యార్థుల ప్రాణాలు కాపాడిన శివకు సన్మానం

తగరపువలస: గత నెల 22న నగరంలో స్కూల్ ఆటోను లారీ ఢీకొన్న ప్రమాదంలో స్పందించి విద్యార్థులను కాపాడిన జీవీఎంసీ భీమిలి జోన్ వాటర్ వర్క్స్ కార్మికుడు వై.శివను సోమవారం సాయంత్రం భీమిలి మండలం తాళ్లవలస భరోసా లవ్ ఫర్ హ్యుమానిటీ లిటిల్ హగ్స్ బాలల సంరక్షణ కేంద్రంలో నిర్వాహకులు సత్కరించారు. కేంద్రంలో క్రిస్మస్ వేడుకల్లో భాగంగా జాతీయ వినియోగదారుల హక్కుల కమిషన్ జడ్జి సూర్యభాస్కరం ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. వినియోగదారుల సంరక్షణ చట్టంపై అవగాహన కలిగించారు. అనంతరం కేక్ కట్ చేసి సన్మాన గ్రహీతకు బుద్ధుని విగ్రహం బహూకరించారు. కార్యక్రమంలో



శివను సత్కరిస్తున్న బాలల సంరక్షణ కేంద్ర ప్రతినిధులు

వెంపాడ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు వెంపాడ శ్రీనివాసరెడ్డి, సంరక్షణ కేంద్రం నిర్వాహకుడు అట్టాడ అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద యువకుడికి ఎస్ఐ కొలువు



అమ్మమ్మతో ఎస్సైగా ఎంపికైన షేక్ జిలాని

సీలేరు: నిరుపేద కుటుంబంలో పుట్టిన షేక్ జిలాని ఎస్ఐ పోస్టుకు ఎంపికయ్యాడు. సీలేరు గ్రామానికి చెందిన షేక్ జిలాని చిన్నతనంలో తల్లి చనిపోయింది. అమ్మమ్మ షేక్ లాల్బీ వద్ద కుమారుడిని వదిలేసి తండ్రి కాకినాడ వెళ్లిపోయాడు. సీలేరులో పదవ తరగతి వరకు, ఇంటర్, డిగ్రీని నాగార్జున సాగర్‌లోని ఏపీఆర్‌జేసీలో చదివాడు. ఎటువంటి కోచింగ్ తీసుకోకుండా ఇంటివద్దే ఉండి చదువుతూ ఎస్ఐ పరీక్షలు రాశాడు. ఇటీవల విడుదలైన ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించాడు. జిలానీని గ్రామస్తులు అభినందించారు.

పుస్తకాలే ప్రపంచం


- గ్రూప్–2కి సన్నద్ధమవుతున్న విద్యార్థులు
- వర్సిటీ పరిసరాల్లో ప్రిపరేషన్
- చలిలోనూ..వీధి దీపాల మధ్య చదువులు



ఫోన్‌లో మాక్ టెస్ట్ రాస్తున్న విద్యార్థి



స్నాతకోత్సవ మందిరం ప్రాంగణంలో చదువుకుంటున్న విద్యార్థులు



వీధి దీపం వెలుగులో..



చలిలో స్వెట్టర్ వేసుకుని చదువుకుంటున్న విద్యార్థులు



గ్రంథాలయం పరిసరాల్లో ...

ఏయూక్యాంపస్: వారు అక్షర నేస్తాలు...పుస్తక ప్రియులు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన అధికశాతం మంది నిత్యం అక్కడ పుస్తకాలతో మనకు దర్శనమిస్తుంటారు. ఆంధ్రవిశ్వవిద్యాలయం డాక్టర్ వీఎస్ కృష్ణా గ్రంథాలయం, స్నాతకోత్సవ మందిరం, ఆర్ట్స్ కళాశాల పరిసర ప్రాంతాల్లో వీధిదీపాల వద్ద చదువుకుంటూ మనకు కనిపిస్తారు. ప్రభుత్వ కొలువు సాధించాలనే దృఢ సంకల్పంతో వీరు వర్సిటీని వేదికగా చేసుకుని తమ లక్ష్య సాధన కోసం నిత్యం పరిశ్రమిస్తున్నారు.

ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం గ్రూ –2 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఫిబ్రవరిలో దీనికి సంబంధించిన పరీక్ష జరగనుంది. ఈ నేపథ్యంలో పెద్ద సంఖ్యలో విద్యార్థులు వీటికి దరఖాస్తు చేసుకున్నారు. ఎగ్జిక్యూటివ్, నాన్ ఎగ్జిక్యూటివ్ విభాగాల్లో మొత్తం 899 ఉద్యోగాలు భర్తీ కానున్నాయి. వీటిని సాధించాలనే లక్ష్యంతో వర్సిటీ ప్రాంగణంలో పదుల సంఖ్యలో విద్యార్థిని, విద్యార్థులు పుస్తకాలే ప్రపంచంగా గడుపుతున్నారు.

రోజూ ఒక నిర్దిష్ట ప్రణాళికను సిద్ధం చేసుకుని, సమయం వృథా కాకుండా వీరు పరీక్షకు సన్నద్ధమవుతున్నారు. ఆధునికత సాంకేతికతను సైతం వీరు అందిపుచ్చుకుంటున్నారు. గ్రూప్ 2 పరీక్షకు సిద్ధమవుతూ నిత్యం ఒక నమూనా పరీక్ష (మాక్ టెస్ట్)కు సైతం హాజరవుతున్నారు. తమ సెల్‌ఫోన్‌లోనే ప్రత్యేకంగా రుసుము చెల్లించి నిత్యం మాక్ టెస్ట్‌లతో తమ జ్ఞానాన్ని పరీక్షించుకుంటున్నారు. ఆన్‌లైన్ యాప్‌లకు మూడు నెలలు, ఆరునెలలు, ఏడాది కాలానికి ప్రత్యేక రుసుము చెల్లించి పరీక్షలకు హాజరయ్యే అవకాశం కల్పిస్తున్నాయి. మరికొంత మంది ఆన్‌లైన్‌లో నిపుణులు పాఠాలు, సబ్జెక్ట్ నిపుణుల ప్రసంగాలు వింటూ కొత్త విషయాలను తెలుసుకుంటున్నారు. మరికొంత మంది పుస్తకాల్లో ముఖ్యమైన అంశాలను చదివిన వెంటనే నోట్స్ రూపంలో రాసుకుంటున్నారు. ప్రముఖ సంస్థలు ప్రచురించిన స్టడీ మెటీరియల్స్‌ను సైతం స్నేహితుల నుంచి సంగ్రహించుకుని చదువుకుంటున్నారు.

వర్సిటీలో ప్రస్తుతం పీజీ కోర్సులు చేస్తున్న విద్యార్థులతో పాటు, ఇప్పటికే పీజీ, బీఈడీ వంటి కోర్సుల్లో ఏయూలో పూర్తి చేసిన పూర్వ విద్యార్థులు సైతం గ్రూప్ 2 పరీక్షలకు తీవ్రంగా శ్రమిస్తున్నారు. కొంతమంది ప్రైవేటు హాస్టల్స్‌లో ఉంటూ, మరికొంత మంది స్నేహితులతో కలిసి ఇళ్లు అద్దెకు తీసుకుని చదువుకుంటున్నా రు. నెలకు రూ.5 వేల వరకు అద్దెకు, భోజనానికి వెచ్చిస్తూ పరీక్షల కోసం నిత్యం వర్సిటీలో ప్రశాంత వాతావరణంలో చదువుకుంటూ తమ లక్ష్యాన్ని చేరుకునే దిశగా ముందుకు సాగుతున్నారు. సోమవారం క్రిస్మస్ రోజున సైతం రాత్రి చలిలో వీరు పుస్తకాలను వదలకుండా చదువుకుంటూ కనిపించారు. పండుగలు, స్నేహితులు, ఫంక్షన్లు ఇలా అన్నీ పక్కన పెట్టి కేవలం ఉద్యోగం పొందడం లక్ష్యంగా సాధన చేస్తున్నారు.

నేత్రపర్వంగా మార్గశిర మాసోత్సవాలు

కనకమహాలక్ష్మి అమ్మవారికి విశేష పూజలు

దాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి ఆలయంలో మార్గశిర మాసోత్సవాలు కనులపండువగా జరుగుతున్నాయి. 12వ రోజు, సోమవారం అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. టౌన్ కొత్తరోడ్డు వరకు క్యూలైన్లలో బారులు తీరారు. అమ్మవారికి విశేష పూజలు చేశారు. అమ్మవారికి ఉదయం 5 నుంచి 6 గంటల వరకు పంచామృతాభిషేకాలు, సహస్ర నామార్చన చేసి, 6 నుంచి 11 గంటల వరకు సర్వదర్శనాలు కల్పించారు. 11.30 నుంచి 12 గంటల వరకు అమ్మవారికి పంచామృతాభిషేకాలు చేశారు. మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సర్వదర్శనాలు ఏర్పాటు చేశారు. సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు విశేష పంచామృతాభిషేకాలు, అష్టోత్తర నామార్చన నిర్వహించారు. అమ్మవారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు.

➡ అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో 28 మంది ఉభయదాతలు పాల్గొన్నారు.



అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

మధ్యాహ్నం టౌన్‌కొత్తరోడ్డు సమీపాన గల జగన్నాథస్వామి ఆలయంలో 2 వేల మంది భక్తులకు అన్న సమారాధన నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

ధర్మప్రచార మాసోత్సవాలు..మార్గశిర మాసోత్సవాలను పురస్కరించుకుని సోమవారం సాయంత్రం కనకమహాలక్ష్మి ఆలయ ప్రాంగణంలో లలిత డ్యాన్స్ అకాడమీ కళాకారిణి ఎం. లలిత నృత్య ప్రదర్శన అలరించింది. మంగళవారం నగరానికి చెందిన చెళ్లపిళ్ల మహర్షి, పాతనగరం రాజప్పనాయుడు వీధి ఆనందకుమార్‌చే బుర్రకథ ఏర్పాటు చేసినట్టు ఈవో శిరీష తెలిపారు.

వేటకు వెళ్లి మత్స్యకారుడి మృతి

అచ్యుతాపురం: సముద్రంలో వేటకు వెళ్లిన పూడిమడక మత్స్యకారుడు మృతి చెందారు. దీనికి సంబంధించిన వివరాలివి.. పూడిమడక జాలరిపాలేనికి చెందిన ఐదుగురు మత్స్యకారులు ఈ నెల 18న బోటులో సముద్రంలోకి వేటకు వెళ్లారు. తెడ్డు అప్పన్న(62) తోపాటు కొండబాబు, పోలరాజు, కాసుబాబు, శ్రీనులు వేటకు వెళ్లి 24వ తేదీ రాత్రి తిరిగి బయలుదేరారు. అయితే బోటు తిరగబడడంతో అప్పన్న మృతి చెందారు. మృతునితోపాటు, నలుగురు మత్స్యకారులు 25వ తేదీ ఉదయం 8 గంటలకు ఒడ్డుకు చేరుకున్నారు. మృతునికి ఇద్దరు భార్యలు, ఆరుగురు పిల్లలు ఉన్నారు.


● ఒకే మాటగా.. ఒకే బాటగా..



సోమవారం ఉదయం 5.30 గంటల సమయంలో ఆకాశం అందమైన నారింజ-ఎరుపు రంగులో కనిపించింది. ఆ సమయంలో తీరంలో గుంపుగా పక్షులు ఎగురుతున్న దృశ్యం ఒక ప్రత్యేకమైన అనుభూతిని కలిగించింది. ఇది చూసిన వాకర్స్ వావ్ అనగా.. సాక్షి కెమెరా క్లిక్‌మనిపించింది.

● సంద్రం.. స్వర్ణమయం

సూర్యోదయం సమయంలో సముద్రంపై లేలేత కిరణాలు స్వర్ణమయంగా కనిపించాయి. అవి నీటిపై ప్రతిబింబించి, సముద్రాన్ని ఒక అద్భుతమైన రంగులో మార్చాయి. నీరు నారింజ, గులాబీ, స్వర్ణం ఇలా వివిధ రంగుల్లో కనిపించింది. ఈ దృశ్యం చూపరులను ఆకట్టుకుంది.



\- ఫొటోలు: సాక్షి, ఫొటో గ్రాఫర్

సందడిగా పర్యాటక కేంద్రాలు



సన్‌రైజ్ వ్యూపాయింట్ వద్ద పాల సముద్రాన్ని తలపిస్తున్న మేఘాలు



చాపరాయి వద్ద సందర్శకులు

అరకులోయ రూరల్/డుంబ్రిగుడ/అనంతగిరి: జిల్లాలో పర్యాటక కేంద్రాలకు సోమవారం సందర్శకులు పోటెత్తారు. అరకులోయ సమీపంలో గల మాడగడ సన్ రైజ్ వ్యూపాయింట్‌కు పర్యాటకుల తాకిడి భారీగా పెరిగింది. కుటుంబ సమేతంగా సందర్శకులు వచ్చి సందడి చేశారు. ఇక్కడ ట్రాఫిక్ జామ్ అవడంతో కిలోమీటరు మేర వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి.

- డుంబ్రిగుడ మండలం చాపరాయి జలపాతానికి భారీగా సందర్శకులు వచ్చారు. ఉల్లాసంగా జలకాలాడారు. అరకు–పాడేరు ప్రధాన మార్గంలో ఉన్న పొద్దుతిరుగుడు పూల తోటల్లో ఫొటోలు తీసుకున్నారు.
- అనంతగిరి మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన బొర్రాగుహలు పర్యాటకులతో సందడిగా మారాయి. బొర్రాగుహలను తిలకించేందుకు పర్యాటకులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో గేటువలస నుంచి బొర్రా వరకు రోడ్డు పర్యాటకుల వాహనాలతో రద్దీగా మారింది. మూడు రోజులుగా టూరిస్ట్‌స్పాట్లన్నీ కళకళలాడుతున్నాయి. సోమవారం బొర్రాకు 10,800 మంది పర్యాటకులువచ్చారని, ఆదాయం రూ.8.39 లక్షలు లభించినట్టు బొర్రా యూనిట్ మేనేజర్ గౌరీశంకర్ తెలిపారు.

పాపికొండలకు పర్యాటకుల తాకిడి

14 బోట్లలో 1000 మంది తరలింపు

వీఆర్‌పురం: క్రిస్మస్ సెలవులతో పాపికొండలకు పర్యాటకుల తాకిడి పెరిగింది. సోమవారం పోచవరం బోటు పాయింట్‌కు అధిక సంఖ్యలో పర్యాటకులు తరలివచ్చారు. మిచాంగ్ తుపాను ప్రభావంతో 20 రోజుల పాటు అధికారుల ఆదేశాల మేరకు బోటింగ్‌ను నిలిపివేశారు. కాగా గత వారం అధికారులు తిరిగి అనుమతినిచ్చారు. అయినా పర్యాటకులు అంతంతమాత్రంగానే ఉన్నారు. ఆది, సోమవారాలు సెలవు కావడంతో పర్యాటకులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. 14 బోట్లలో వెయ్యిమందికి పైగా పర్యాటకులు పాపికొండల సందర్శనకు వెళ్లినట్టు ఏపీటూరిజం కౌంటర్ అసిస్టెంట్ సీహెచ్.రాజేష్ తెలిపారు. పర్యాటకులు అధిక సంఖ్యలో తరలిరావడంతో బోటింగ్ పాయింట్ ,పేరంటాలపల్లి శివాలయం ప్రాంతాలు కళకళలాడాయి.



పేరంటాలపల్లి రేవు వద్ద పర్యాటకులు